క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 83, వంకాయ 40, బెండ 55, పచ్చిమిర్చి 65, కాకర 55, బీర 37, క్యాబేజీ 20, ఫ్రెంచిబీన్స్ 45–95, క్యారెట్ 45, దొండ 20–28, చిక్కుడు 40–65, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 70, ఆలు 23, దోస 23, సొర 15, పొట్ల 28, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్ రావు తెలిపారు.

- ఉ. 11 నుంచి మ. ఒంటి గంట వరకు... నూర్‌ఖాన్ బజార్, యునైటెడ్ బేకరీ, నూర్ కేఫ్, కోమటివాడి, సెంట్రల్ బ్యాంక్, గర్ల్స్ స్కూల్, దారుషిఫా చమన్, ఇండియన్ బ్యాంక్, మదీనా కాంప్లెక్స్, గోల్‌కబర్, లాల్‌మిట్టీ దర్గా, ఎంసీహెచ్ ఆఫీస్ పరిసర ప్రాంతాలు.
- ఉ.11 నుంచి మ.12 గంటల వరకు... ముస్తానా హాస్పిటల్, హుస్సేనీ మొహల్లా, ఎస్‌డీఎం స్కూల్, గోల్‌కబర్ పరిసర ప్రాంతాలు.

మాదన్నపేట ఇన్‌స్పెక్టర్‌గా సునీల్



చంచల్‌గూడ: నగర పోలీసు శాఖలో బదిలీల్లో భాగంగా మాదన్నపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె. సునీల్ వచ్చారు. బహదూర్‌పురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను కమిషనర్ ఇక్కడికి బదిలీ చేశారు. మాదన్నపేట సీఐగా విధులు నిర్వహిస్తున్న బి. జానయ్య డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై వెళ్లారు.

నేడు బీజేపీ ధర్నా

సైదాబాద్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం మాయ మాటలు చెప్తూ వారిని మోసగిస్తోందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆరోపించారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం సైదాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సురేందర్‌రెడ్డి మంగళవారం సైదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో బీజేపీ తరుపున ఎండకడతామన్నారు. ధర్నా కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బండ్లగూడ పరిధిలో పిన్‌కోడ్ 500068గా రాయాలి

నాగోలు: సరైన పిన్‌కోడ్ ఉపయోగిస్తే ఉత్తరాల జారీలో జాప్యం ఉండదని బండ్లగూడ జీఎస్‌ఐ సబ్ పోస్ట్‌మాస్టర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిన్‌కోడ్ ఆధారంగానే ఉత్తరాల సార్టింగ్ జరుగుతుందని, పిన్‌కోడ్ సరైనది రాయకపోవడంతో ఉత్తరాల జారీలో జాప్యం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. బండ్లగూడ జీఎస్ఎస్ పరిధిలోని ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ నుంచి, ఎంఈ రెడ్డి ఫంక్షన్ హాల్ వరకు, మన్సూరాబాద్, రాక్‌టౌన్, నాగోలు బ్రిడ్జి వరకు, నాగోలు, జైపురికాలనీ, సాయినగర్, తట్టి అన్నారం కాలనీ బండ్లగూడ జీఎస్‌ఐ పోస్టాఫీస్ పరిధిలోకి వస్తాయని, కావున అందరూ 500068 పిన్ కోడ్ రాయాలని సబ్ పోస్ట్‌మాస్టర్ తెలియజేశారు.

మూసీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



నాగోలు: మూసీ నది పక్కన గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. నాగోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు మూసీ నది పక్కన గుర్తుతెలియని మహిళ మృతదేహం పడి ఉండటంతో గమనించిన స్థానికులు నాగోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా అక్కడ ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతురాలి వయస్సు(30) ఉంటుందని, కుడి చేతిపై టాటూ ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తూ అందులో పడి మృతి చెందిందా..లేక వరదకు ఎక్కడి నుంచి అయినా మృతదేహం కొట్టుకొచ్చిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్లు ఛిద్రం.. జర భద్రం

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ జక్కిడి రాంరెడ్డి కాలనీ సమీపంలో గుంతలమయంగా మారిన రోడ్లు





ఇటీవల కురిసిన వర్షాలకు ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ప్రధాన రహదారులతో పాటు కాలనీల అంతర్గత రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారాయి. దీంతో ఆ దారిన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల గుంతల్లో నీరు నిలిచి గుంత లోతు తెలియకపోవడంతో అందులోంచి వెళ్తూ వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టినందువల్ల జీహెచ్‌ఎంసీ అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు చేపట్టి, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – వనస్థలిపురం

సీఎం దృష్టికి ఎఫ్‌టీఎల్ సమస్యను తీసుకెళ్తా..



ఎమ్మెల్యేతో గ్రీన్ పార్క్ కాలనీ నూతన కార్యవర్గం

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఎఫ్‌టీఎల్ సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. గ్రీన్ పార్క్ కాలనీ నూతన అధ్యక్షుడు జగన్‌రెడ్డి, వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన చైర్మన్ బాల్‌రెడ్డిలు నూతన కార్యవర్గ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీలోని వరద నీటి సమస్య పరిష్కారం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టామన్నారు. డివిజన్‌లో అతి పెద్ద కాలనీ అయిన గ్రీన్ పార్క్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కోవడం అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, కాలనీ వాసులు మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మధుసూదన్, అంజయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, చంద్రగుప్తా పాల్గొన్నారు.

కాలనీలో పర్యటించిన కార్పొరేటర్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కాలనీల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ ఎ.రాధధీరజ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కార్పొరేటర్ అధికారులతో కలిసి వాసవికాలనీ, అల్కాపురి తదితర కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా కాలనీలోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజీని పూర్తిగా ఆధునీకరిస్తామన్నారు. కాలనీలో నూతన రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేయాలి



పారిశుద్ధ్య విభాగం అధికారులు, కార్మికులతో కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్‌లో పటిష్ట పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బంది, కార్మికులు కృషి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య పనులపై ఏఎంహెచ్ఓ నీలిమతో కార్యాచరణ సమావేశం కార్పొరేటర్ తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో చెత్త సమస్య తీవ్రంగా ఉందని, పారిశుద్ధ్య పనులపై అలసత్వం వహిస్తున్నారని అన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, సిబ్బంది కూడా డివిజన్‌లో పర్యటించి కార్మికులకు సూచనాలు చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ ఎస్ఎస్ అజీముద్దీన్, జవాన్ రామచందర్, ఎస్ఎఫ్ఏ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బృందవనం మేడోస్ కాలనీలో తీసిన సెప్టిక్ ట్యాంక్‌లో ప్రమాదవశాత్తూ పడి గాయాలతో ప్రగ్మా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సిలివేరు తేజను మంగళవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ, తేజ త్వరగా కోలుకోవాలని, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శివశంకర్, జగన్మోహన్‌చారి, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐ శిక్షణ సంస్థలో వార్షిక కెపాసిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్ ప్రసాద్

మన్సురాబాద్: మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని జీఎస్ఐ శిక్షణాసంస్థలో వార్షిక కెపాసిటీ బిల్డింగ్ ప్లాన్ సమావేశం మంగళవారం జరిగింది.సమావేశంలో జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ జనార్దన్‌ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వరరావు, అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ మధ్యూ జోసఫ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆదిల్ జైనుల్బాయ్, చైర్మన్ సీబీసీ, జీఎస్ఐ సీనియర్ అధికారులు, సీబీసీ సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.

మెట్రో విస్తరణ నిర్ణయం హర్షణీయం



సింగరేణికాలనీలో మిఠాయిలు పంచుతున్న మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి

సైదాబాద్: మెట్రోను విస్తరిస్తూ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి అన్నారు. నగరం నలుమూలలా మెట్రోను విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు డివిజన్ బీఆర్ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ, సరస్వతీనగర్ కాలనీల్లో వారు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా స్వప్నారెడ్డి మాట్లాడుతూ, నగరంలో ట్రాఫిక్ జామ్ సమస్య పరిష్కరించేలా, ప్రజారవాణా వ్యవస్థ మెరుగుపడేలా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతూ దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, గున్న మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఇబ్రహీం పాల్గొన్నారు.

నాలా నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి అధికారులకు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. మంగళవారం ఐఎస్‌సదన్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో చేపట్టిన నాలా నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాలా నిర్మాణ పనుల వలన స్థానికులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా నాలా నిర్మాణ పనుల కోసం తీసిన గోతుల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా కాంట్రాక్టర్లు రక్షణచర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో తాత్సారం చేయకుండా నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తయ్యేలా ఎస్ఎన్‌డీపీ అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండాలని ఆమె అన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనుల పేరుతో దోపిడీ

మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి



నాగోలులో మధ్యలో నిలిచిన ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలిస్తున్న బీజేపీ నేత ఇంద్రాసేనారెడ్డి తదితరులు

నాగోలు: హైదరాబాద్‌ను డల్లాస్ నగరంగా తీర్చిదిద్దుతామని నగర వాసులను ఊరించి ఎస్ఎన్‌డీపీ పనుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం దోచుకోవడం తప్ప వరద సమస్యను పరిష్కరించింది లేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని నాగోల్, గడ్డి అన్నారం డివిజన్లలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాగోలు, గడ్డిఅన్నారం కార్పొరేటర్లు చింతల అరుణాసురేందర్ యాదవ్, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తో కలిసి పర్యటించారు. నాగోలు జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి తెలంగాణకే యాక్టింగ్ చీఫ్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నారని, విదేశాల్లో చదివి వచ్చిన ఆయన గత ఏడేళ్లుగా హైదరాబాద్‌ను ఆగం చేస్తున్నారన్నారు. కోటి జనాభా ఉన్న నగరంలో 2015లో గ్రేటర్ ఎన్నికల ముందు 100రోజుల ప్రణాళికలో గుంతలు కనిపిస్తే వెయ్యి ఇస్తామన్నారు. తొమ్మిదేళ్లైనా సమస్యలు పరిష్కరించలేదన్నారు. నగరంలో నాలాలు, మంచినీటి సమస్య, డ్రైనేజీ సమస్యను పరిష్కారం కాలేదన్నారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వరదనీటి సమస్య పరిష్కారం కోసం 20 సంవత్సరాల ముందు వేసిన ప్లాన్ వల్ల ఇప్పటి వరకు ఇబ్బంది కలగలేదన్నారు. గతంలో సరూర్‌నగర్ చెరువు నుంచి మూసీ వరకు పైప్‌లైన్ వేసినట్టే వేసి పనులు మధ్యలోనే వదిలేశారన్నారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పగలగొట్టి అక్రమంగా డ్రైనేజీ బాక్స్ డ్రెయిన్లు నిర్మిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేపీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు డప్పు రాజు, వస్పరి మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని దావత్‌ఖాన్‌గూడలో సర్వేనంబర్–2లో భూబాధితుల కుటుంబాలు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 3వ రోజుకు చేరుకున్నాయి. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన దారిలో ఉన్న ఈ భూమి వద్ద బాధితులు, మహిళలు పిల్లలతో కలిసి నిరసనకు దిగారు. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రస్తుతం ఉన్న ఖాళీ భూమి మొత్తాన్ని 300 కుటుంబాలకు 120 గజాల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుని ఆభూమినే నమ్ముకుని ఉన్న మా కుటుంబాలకు అన్యాయం చేయవద్దని కోరారు. కబ్జాలో ఉన్న మాకు న్యాయం చేయాలని కోరారు. దీక్షలు చేస్తున్న వారిలో లక్ష్మమ్మ, కలమ్మ, అంజమ్మ, ఆండాలు, రమేష్, యాదయ్య, రాములు, ఉమాకాంత్, మురళి తదితరులున్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి: టీసీడబ్ల్యూఏ



వనస్థలిపురంలో పీస్ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

వనస్థలిపురం: మణిపూర్‌లో హింసకాండను వ్యతిరేకిస్తూ ది క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ (టీసీడబ్ల్యూఏ) వనస్థలిపురం ఆధ్వర్యంలో క్రైస్తవులు మంగళవారం వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అత్యాచారాలు అనాగరికమని, సభ్యసమాజం వీటిని తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. వనస్థలిపురం ఫేజ్–4 బాప్టిస్టు చర్చి నుంచి బయలుదేరిన ఈ ర్యాలీలో ది క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలోని వివిధ సంఘాలకు చెందిన వారు సుమారు 1500 మంది ప్లకార్డులు చేతపట్టి సేవ్ మణిపూర్, మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి అంటూ నినాదాలు ఇచ్చారు. ర్యాలీ ఎస్‌కేడీనగర్ చౌరస్తా, ఎన్జీవోస్ కాలనీ, రెడ్ వాటర్ ట్యాంక్, గణేష్ టెంపుల్, వనస్థలిపురం కాంప్లెక్స్, సచివాలయనగర్ 8వి రోడ్డు మీదుగా క్రైస్ట్ గాస్పల్ చర్చి వరకు జరిగింది. టీసీడబ్ల్యూఏ అధ్యక్షుడు జ్యోతి రాజు, కార్యదర్శి నోయల్ రాబిన్, కోశాధికారి దాసరి అజయ్, వివిధ సంఘాల పాస్టర్లు, మాజీ అధ్యక్షులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి



హస్తినాపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ ఖాద్రికాలనీలో కాలనీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, వారి భాగస్వామ్యంతోనే పనులు త్వరితగతిన పూర్తికావడమే కాకుండా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జమీర్, సయ్యద్ అబ్బాస్, ఖయ్యూం, మమత, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అన్ని విధాలా అభివృద్ధి చేశా: ఎమ్మెల్యే

లింగోజిగూడ: నియోజకవర్గంలోని పార్కుల్లో సదుపాయాలు కలిపించి అన్ని విధాల అభివృద్ధి చేశానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్క్ వాకర్స్ విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆయన పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్క్‌లో వాకర్స్ కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పార్క్‌లో ఓపెన్ జిమ్, ఆధునిక టాయిలెట్స్, యోగా సెంటర్‌తో పాటు ప్రవేశ ద్వారం వద్ద నెమలి ఆకారం ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దామన్నారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



ప్రియదర్శిని పార్క్ వాకర్స్‌తో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఓటర్లను ఆకర్షించేందుకే సంక్షేమ పథకాల ప్రకటనలు: సామ



కాలనీలలో పర్యటిస్తున్న సామ రంగారెడ్డి, బీజేపీ నాయకులు

లింగోజిగూడ: నాలుగేళ్లు నిద్రపోయిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇప్పుడు మేల్కొని ఓటర్లను ఆకర్షించేందుకు పథకాలు ప్రకటిస్తోందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. ఇంటింటికీ బీజేపీలో భాగంగా మంగళవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని దానపురం, ఎస్‌బీహెచ్ కాలనీ వెంచర్–1, మైత్రినగర్, సౌభాగ్య కాలనీ, గౌతమ్‌నగర్, కృష్ణాష్టనగర్ కాలనీలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, ఇన్ని రోజులుగా నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇప్పుడు అభివృద్ధి అంటూ శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శించారు. సత్తన దకన జరుగుతున్న నాలా పనుల కారణంగా స్థానికులు ఇబ్బందిపడుతున్నా పట్టించుకోలేదని, నాలుగున్నరేళ్లలో చేయలేని పనులు ఈ మూడు నెలలో పూర్తి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీకి నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తోందని, వచ్చే ఎన్నికలలో బీజేపీకి ప్రజలు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, హరిప్రసాద్, కృష్ణంరాజు, కిరణ్‌కుమార్, రాకేష్‌యాదవ్, మల్కాజిగిరి నాగరాజు, జగదీశ్, గట్టు రవి, రాంమోహన్‌రావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి ఆర్టీసీ కార్మికుల పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

హయత్‌నగర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆర్టీసీ చరిత్రలో ఇది సుదినం అని, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనేది కార్మికుల చిరకాల కోరిక అని అన్నారు. కార్మికులు మరింతగా కష్టపడి ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ఇది ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్లు కృష్ణయ్య, విజయకుమారి సిబ్బంది షాలిని, రమణ, మహిపాల్‌రెడ్డి నెహ్రూ నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓక్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు అంతర్జాతీయ పురస్కారం



పాఠశాల వైస్ చైర్మన్ గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నాగోలు: కొత్తపేట సత్యానగర్‌లోని ఓక్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ అంతర్జాతీయ అవార్డును అందుకుంది. ఎక్సలెన్సీ ఇన్ ఇన్నోవేషన్ అండ్ రిఫార్మేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ సిస్టమ్ అనే అవార్డును 'ఫిట్జ్ విలియమ్స్ కాలేజీ, యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ యునైటెడ్ కింగ్‌డమ్ వారు అందజేశారని వైస్ చైర్మన్ కోమిటిరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు.తమ పాఠశాలలో ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ మెథడాలజీ, నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ అమలు చేస్తున్నందుకు ఈ అవార్డు వరించిందన్నారు.ఈ సందర్భంగా మంగళవారం ఓక్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గోపాల్‌రెడ్డిని విద్యార్థులు, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ లక్ష్మ రెడ్డి, డైరెక్టర్ శారదా రెడ్డి, నాగేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీకి నెల క్రితం మంత్రి సబితారెడ్డి చొరవ తీసుకుని బీటీ, సీసీ రోడ్లకు రూ.2.20 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ బోయపల్లి దీపిక ఆధ్వర్యంలో రోడ్డు పనులు ప్రారంభించారు.